# ముగ్గు

సంక్రాంతికి ముందటి రోజులు కనుక ఉదయం పూట చలిగాలి అలలు తాకుతోన్నాయి. దానికి తోడు తెల్లవారుజామునెక్కడో వానకురిసిందేమో........ మరింత చురుగ్గా, పదునుగా తాకి వణుకు పుట్టిస్తున్నాయి. తనకు ఇవాళ 'ఆఫ్' అన్న సంతోషం లోపల్నించీ తన్నుకొస్తుంటే, బయట చలిగాలి వణుకు పుట్టిస్తుంటే, వెంటన్ 'కాఫీ' పెట్టుకుని తాగేసి, ఒంటిని వెచ్చ బరచుకోవాలను కుంది సత్యవతి. 'కాఫీ ' చేస్తున్నప్పుడు "ఇవాళ యేమేం చెయ్యాలా?" అని ఆలోచించింది.

అమ్మకు ఉత్తరం రాయాలి, చాలా రోజులయింది కనుక అనూరాధను చూడాలి, ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్నమంచి సినిమా వచ్చింది కనుక చూడాలి (వీలైతే అనూరాధతో కలిసి) తను రాయాలనుకున్న వ్యాసానికి అవసరమైన సమాచారం సేకరించుకోవాలి....... ఇలా ఈ రోజు చేయవలసినవి వరుసగా జ్ఞాపకం వచ్చే సరికి నవ్వొచ్చింది. సెలవురోజున యేమేం చెయ్యాలో వారం పొడుగునా ఆలోచిస్తుండడం, ఆ రోజొచ్చినప్పుడు ఏ ఒక్కపనీ చెయ్యలేక పోవడం...... ఎన్నో సార్లు జరిగిందే. ఈ రోజూ ఇకముందూ ఇలా జరగదని చెప్పడానికీ లేదు.

కనుక, 'సుబ్బం పిన్ని' చెప్పినట్టూ, "దేవుడు యీ రోజు యేమేం చెయ్యమంటే అవి చేయాలి తప్పితే మనంగా యేమీ చెయ్యలేం" అనుకుని నవ్వుకుంది సత్యవతి. "దేవుడు కాఫీ చేసుకోమన్నాడు, చేసుకున్నా......... కప్పులో పోసుకోమన్నాడు, పోసుకున్నా........ ఇంక స్టవ్ కట్టేయమనడూ? అంటాడు. ఆమాత్రం దేవునికి తెలీదా ఎట్టా? కట్టేశాను.......... ఇప్పుడు పేపర్ చూసుకోపో అన్నాడు దేవుడు, చూసుకుందాం" ఈ మాటలు మనసులో అనుకోకుండా బయటికే నాటకంలో పాత్రలాగా అనేసి మనసారా నవ్వుకుంది. కప్పు చేత పట్టుకునే గేటు దగ్గర పడేసిన 'పేపర్' కోసం వెళ్లింది. గేటు దగ్గర్నుంచీ వీధికేసిచూస్తే, ఇరువైపులా గుమ్మాలముందు ఆడవాళ్ళు శ్రద్ధగా ముగ్గులేసుకుంటున్న దృశ్యం. కొన్ని

ఇళ్ళముందు తెల్లవారక ముందే పెద్దపెద్ద ముగ్గులు వేశారు. వేసేసిన వాళ్ళు తమ 'కళా ప్రతిభ'ను పక్కవాళ్ళకు ప్రదర్శించి ఇంకా వాళ్ళ 'కళాప్రతిభ'ను తాము పరీక్షిస్తున్నట్లుగా; పక్కన వేస్తున్న ముగ్గులను దీక్షగా పరిశీలిస్తున్నారు. మొత్తం మీద ఆవీధి ఆడవాళ్లంతా తడిసిన చీరెల్తో, ముగ్గుపిండి చేతుల్తో చలిని లెక్క చేయకుండా క్రమశిక్షణ కలిగిన సాంస్కృతిక సైన్యం లాగా ముగ్గులేసుకోవడంలో మునిగి పోయారు.

"హ్హా......." అని సత్యవతి నిట్టూర్చి, పేపర్ అందుకుని వచ్చి ముందు గదిలో కూర్చుంది. కాఫీ 'సిప్' చేస్తూ ఒక్కో పేజీ తిరిగేసింది. 'తెలుగు గంగ తో రాయలసీమ సస్యశ్యామలం' 'బోఫోర్స్ గొడవలో కొత్తమలుపు' లాంటి పెద్ద శీర్షికలనుంచీ 'వివాహిత పై అత్యాచారం' 'శీలంశంకించి భార్యహత్య' లాంటి సింగిల్ కాలమ్ వార్తల వరకూ వచ్చింది. ఆ వరుసలోనే "మహిళలకు ముగ్గులపోటీ" కూడా కనపడింది. వచ్చే ఆదివారం లయనెస్ క్లబ్ వారూ, స్థానిక మహిళల పత్రిక వారూ సంయుక్తంగా యీ ముగ్గుల పోటీ నిర్వహించనున్నారట. విజేతలకు 'కలెక్టర్ శ్రీమతి చేత బహుమతి ప్రదానం.'

కాఫీ రుచిగా లేనట్టనిపించింది సత్యవతికి. ఈ కలెక్టర్ భార్యలకూ (ఛీ! ఛీ! ఈ కలెక్టర్ భార్యకూ, లేక ఈ కలెక్టర్ల భార్యలకూ అనాలిగదా), లయనెస్ లకూ ముగ్గువేయడం కూడా చేతయుండదు. వాళ్ళ ఇళ్ళముందు వాళ్ళ పని మనుషులు వేస్తూ వుంటారు. ముగ్గువేయడం తెలీకపోయినా, తెలిసీ వేయకపోయినా 'ముగ్గుకళ' ను పోషించే అముగ్ధ (లేక, ముగ్గు) హృదయం మాత్రం వుంటుంది! అవునుమరి, లలిత కళలు స్త్రీల సొత్తు, పరుషకళలు పురుషుల సొత్తుకదా! ఒంటికి కొంచెం వెచ్చదనం ఇచ్చేందుకు సత్యవతి 'కాఫీ' చేసుకుని సేవించింది కానీ, ఇప్పుడు కోరుకున్నంత కంటే ఎక్కువ వెచ్చదనం వచ్చేసినట్టుంది. పైగా, ఈ వెచ్చదనం ఒక్క ఒంటిమీదేకాదు. ఆమె మనసుమీద, ఆలోచనలమీద కమ్మినట్టయింది. ముగ్గులాగితే....... డొంకంతా కదిలింది.

సత్యవతి వైవాహికజీవితం సంప్రదాయ బద్ధంగా, చట్ట బద్ధంగా ప్రారంభమైనా ముగియడం యీ రెండిట్నీ పట్టించుకోకుండానే ముగిసిపోయింది. దుష్టులకు దూరంగా వుండాలన్న మంచివాళ్ళలాగా, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోకుండా ఆ రెండూ తమ 'పెద్దరికా' న్ని నిలబెట్టుకున్నాయి. తన మొగుడి కన్నా తనకు తెలివి తేటల్లూ, చదువూ ఎక్కువున్నందుకు సత్యవతి పడవలసిన నరకయాతనంతా పడింది. ఆ శిక్ష కూడా చాలదనుకున్నాడేమో ఆమొగుడు, తన కన్నా అన్నివిధాలా అధమురాలైన పెళ్ళాన్ని వెతికి తెచ్చుకుని సంసార సుఖాన్ని పొందసాగాడు. విజయవాడలోని తన స్నేహితురాలు అనూరాధ సహాయంతో ఒక దినపత్రికలో ఉద్యోగం సంపాదించుకుని, ఆ దాంపత్య కూపంనుంచీ

బయటపడింది సత్యవతి. నెల్లూరు జిల్లాలోని ఎక్కడో పల్లెటూళ్ళో కొద్ది పాటిభూమి ఆధారంతో జీవిస్తున్నతల్లి, ఉద్యోగ మొద్దూ ఏమీవద్దు తన దగ్గరే వుండి పొమ్మని మొదట్లో గొడవచేసినా, తర్వాత ఒప్పుకోక తప్పలేదు.

నెలకు 800 రూపాయల జీతంతో ట్రెయినీ సబ్ ఎడిటర్‌గా చేరి, మొగల్రాజపురంలో నెలకు 200 రూపాయల అద్దెకు రూమ్ తీసుకుంది. ఆరూమ్ కిటికీ గుండా చూస్తే, ఎదురుగా కొండకనపడుతూ ఎంతో బావుండేది. చిత్రప్రసాద్ ఎప్పుడో బెజవాడ వచ్చినప్పుడు ఆకొండను చిత్రించాడన్నది తెలుసుకున్న తర్వాత, ఆ కొండను చూడ్డం ఇంకా అద్భుతంగా వుండేది. "మొగల్రాజ పురంలో వుండడమెందుకూ? మాకు దగ్గరగా వుందూ" అని అనూరాధ అంటే, "అక్కడ కొండ బావుందే" అంది. అట్లాంటి కొండను కూడా వదులుకుని రావలసి వచ్చిన సందర్భం జ్ఞాపకమొస్తే, కొండంత అసహ్యమూ, విరక్తీ ముంచుకొస్తుంది.

అయితే, తనకు అంత చిరాకును కలిగించిన ఆ సందర్భం మరొకరికి ఏమాత్రం పట్టించుకోదగింది కాదనిపించవచ్చు. అనూరాధే అంది "అంత చిన్న విషయానికి నీ కంత పట్టింపుదేనికి? " అని. "అది చిన్న విషయమా?" అంది ఆశ్చర్యంగా. "కాక?" అని అనూరాధ కొంచెంవిసుగ్గా అంది.

"ఛీ! ఛీ! ఇక మాట్లాడకు" అని కోపంతో ఇక మాట్లాడలేకపోయింది తనే. అదిచిన్న విషయం కాదని ఇప్పటికీ తన అనుభవం పదేపదే గుర్తు చేస్తోనే వుంది. పైకి కనిపిస్తున్న ఆ 'చిన్నవిషయం' వేళ్ళు ఎంత లోతుగా, ఎంతబలంగా భూమి లోపలికి దిగిపోయాయో అనూరాధకు తెలీకనే అలా అంటోంది. ఒకప్పుడైతే తను కూడా అలాగే అనుకునేది. కానీ ఇప్పుడుకాదు.

ఆమె పేరు అదేదో తమాషా పేరు. తెలుగు సినిమాలలో వినిపిస్తుంటుంది. ఆ..... బుల్లెమ్మ! ఆ భారీ కాయం పేరు బుల్లెమ్మ అంటే నవ్వొస్తుంది. ఒకప్పుడైనా ఆమె 'బుల్లెమ్మ' గా వుండివుంటుందని ఊహించలేం. సాహిత్య సమావేశాల్లోనూ, జర్నలిస్టుల సభల్లోనూ తను తరుచు కనిపిస్తూండడంతోనూ, పత్రికల్లో అడపాతడపాతన వ్యాసాలు అచ్చు కావడం తోనూ కొద్దిమంది పరిచయమయ్యారు. అప్పుడప్పుడూ ఎవరయినా తన గదికి వచ్చి మాట్లాడివెళ్లేవారు. తను 'నైట్‌షిఫ్ట్' కూడా చేస్తుంది కనుక రాత్రిళ్ళు డ్యూటీకి వెళ్ళి గదికి చేరుకోవలసివచ్చేది.

బుల్లెమ్మ ఇక ఆరాలు తీయడం ప్రారంభించింది. వివాహమయిందా? అయితే

'హాయిగా' సంసారం చేసుకోకుండా ఒంటిగా ఉద్యోగం చేసుకోడమెందుకు? అమ్మా నాన్న ఏం చేస్తున్నారు? ఎక్కడున్నారు! ఇలా....... ! మొదట్లో ఏదో మామూలుగానే అడుగుతోందని అన్ని వివరాలూ చెప్పింది. కానీ, తనమాటల్నీ ఆమెనమ్మి నట్టులేదని, అవేప్రశ్నలే మార్చి మార్చి అడగడంతో అర్థమయింది. విసుగేసింది. "ఇంతకుముందు అడిగారు, చెప్పాను" అనడంతో పాటు "ఇక చెప్పను" అన్న సూచనా చేసింది. దాన్తో, తనలో 'ఎక్కడా లేని ఆడపిల్లకు తగని పొగరుమోత్తనం' కనిపించింది బుల్లెమ్మకు. తనగదిలో ఎవర్తోనైనా మాట్లాడుతున్నప్పుడు గోడచాటు నుంచీ వివడం ప్రారంభించింది. ఇలా బుల్లెమ్మ జబ్బు రకరకాల 'సైడ్ ఎఫెక్ట్' లకు దారి తీసింది.

అందులో ముఖ్యమయింది గదిముందు 'రోజూ ముగ్గువేయాల' న్న షరతు. బుల్లెమ్మ మొగుడు బుల్లెమ్మకూ, ఇంటికీ ఓనరేకాక ఓలారీక్కూడా ఓనర్. అతనూ, అతనిలారీ సిబ్బందీ గది ముందు రోడ్డు మీదనే వుంటారు కనుక, మగాళ్ళ కళ్ళకు ముగ్గులేని గుమ్మం కనపడుతోంటే బుల్లెమ్మకు 'చచ్చేంత సిగ్గు' గా వుందట. మొదట్లో అలాంటి షరతేదీ లేదని గుర్తుచేస్తే "వీధి ముందు గుమ్మం వున్నప్పుడు ఆమాత్రం తెలీదూ? ఆడదానివి కాదూ?" అంది. "ముగ్గు వేయడం ఆడవాళ్ళ పనే అయినప్పుడు ఆ సంగతి మగవాళ్ళకెందుకూ? గుమ్మం ముందు ముగ్గు ఉంటే అంత బాగుంటుందనుకున్నప్పుడు వాళ్ళే ఎందుకు వేయకూడదు?" ఈ వాదనతో ఇక బుల్లెమ్మకు పిచ్చెక్కిపోయింది. మరింత దురుసుతనానికి దిగి, దేనికోదానికి పోట్లాటపెట్టుకునేది.

అనూరాధ సలహా ప్రకారం 'పోనీ పని మనిషిని ముగ్గు వేయమందామా?' అని కూడా ఒక బలహీనక్షణంలో అనుకుంది. వెంటనే తనను తాను తిట్టుకుంది. తనను 'ఆడపరిధి'లో వుంచాలన్నది బుల్లెమ్మ ఆలోచన. ఆమెకు ఆసంగతి తెలిసినా తెలీకపోయినా అందులోని అంతరార్థం అదే. పనిమనిషి కూడా ఆడదే, ముగ్గువేసేది తనుకాదు కదా అని సరిపెట్టుకోలేదు. గది ఖాళీ చేయకుండా వుండేందుకు ఇంత దిగజారవలసిన అవసరం లేదు. ఇంటికోసం వెదికేటప్పుడు, రోజా గుమ్మం ముందు ముగ్గు వేయాలన్న షరతు ఎదురైంది. "అది మాత్రం కుదరదు. నేను వేయను" అందొకచోట. ఆ ఇంటావిడ చాలా సౌమ్యంగా నవ్వుతూ అంది. "ముగ్గువేయడం మీకు రాదేమో, పోనీ పనిమనిషితో వేయించండి. అయిదు రూపాయలిస్తే పనిమనిషైనా వేస్తుంది." అని సలహాఇచ్చింది. "ముగ్గువేయడం రాకేం, వచ్చు. అయినా వేయను. పనిమనిషి చేతా వేయించను" అంది. ఆమాట కొంచెం ఉద్వేగంతో అన్నట్టుంది. "ఈ పిల్ల కొంచెం 'క్రాక్' లాగా వున్నట్టుందే" అన్నట్టు చూసిందావిడ. అప్పుడు తెలిసింది తనకు. పైకి చిన్నవిషయంగానూ మరోరూపంలోనూ కనిపించేవాటి

యదార్థ స్వరూపాలు వేరని. అందుకే ఆమధ్య జరిగిన మహిళా సభలో ఒకావిడ ఉపన్యసిస్తూ "స్త్రీకి స్త్రీయే శత్రువు" అంటే కాదని గట్టిగా పోట్లాడింది. ఏదో గదిముందు కాస్త చిన్న ముగ్గు వేయించేందుకు ఇంతమొండిపట్టుదల చూపడం అనూరాధకేమీ నచ్చలేదు. గదికోసం తిరుగుతున్నప్పుడు కనిపిస్తే "మనుషలకు యేవేవో కష్టాలు రావడం చూశానుకానీ ఇటువంటి 'ముగ్గు కష్టాలు' రావడం ఎరగను" అనేది, కొంత నవ్వులాటగా, కొంత ఆక్షేపణగా.

చివరికి, ఈ స్టేట్ బ్యాంకికాలనిలో గది దొరికింది. ఒక్కగదికి 300 రూపాయల అద్దెఅయినా, ఇంటివాళ్ళ క్కొంచెం దూరంగా ఖాళీ స్థలం మధ్య నుంది కనుక, తీసుకుంది. అంతకంటే వీళ్ళు ముగ్గు షరతు పెట్టకపోవడం ముఖ్యకారణం. అయితే తన అంచనా తప్పని కొద్ది రోజుల్లో తేలిపోయింది. ఆడవాళ్ళలో మోతాదులో తేడా తప్పితే ఎక్కువ మంది 'బుల్లెమ్మ' లేనని స్పష్టమయింది. అయినాతను ఆ మహిళా నాయకురాలిలాగా స్త్రీకి స్త్రీయే శత్రువనుకోడం లేదు. ఇంటావిడా, డిగ్రీ చదువుతున్న ఆవిడకూతురూ ఎప్పుడు చూసినా ఇంటిని కడుక్కుంటూనో, చిన్న చిన్నగుడ్డపీలికలు పట్టుకుని గోడల్ని తుడుస్తూనో కనిపిస్తుంటారు. ఏపేపరో, పుస్తకమో ముట్టుకోగా చూల్లేదువాళ్లను. రెక్కలు ముక్కలు చేసుకుంటూ వాళ్ళు చేసే 'ఇంటి చాకిరీ' చూస్తే జాలేస్తుంది. ఇటుకలూ సిమ్మెంటుతో కట్టిన ఆ ఇళ్లే వాళ్ళ సర్వస్వమైనట్టూ, వేరే జీవితం ప్రపంచమూ లేనట్టూ కనిపిస్తారు.

"చూశారా, ఎలాంటి పిల్లను తెచ్చి పెట్టారో! నా మొఖానోముగ్గులేదు, వారానికో సారయినా నన్నుకడగడం లేదు" అని గది కన్నీళ్ళు పెట్టుకుని వాళ్ళతో చెప్పుకున్నట్టుగా, రెండుమూడ్రోజులకోసారి గది కడగాలని చెప్పడం మొదలెట్టారు. "చూడండి, గదిని శుభ్రంగా వుంచుకోడం నాకే మంచిది. నాసామాన్లు ఎంతనీటుగా వుంటాయో వచ్చి చూడండి. ఇంకరోజూ గదిని కడుక్కుంటూ ముగ్గులు తీర్చుకుంటూ వుండడమంటారా, నాక్కుదరదు. నా కంత కంటే ఎన్నో ముఖ్యమైనపనులున్నాయి." అని తెగేసి చెప్పింది. దాన్తో వాళ్ల మొహాలు ముడుచుకున్నాయి.

అప్పట్నుంచీ మరీ 'డైరెక్ట్ ఆర్డర్స్' కాకుండా 'ఇన్‌డైరెక్టు ఆర్డర్స్' ఇవ్వడం ప్రారంభించారు. "ఇల్లు శుభ్రంగా లేక పోతే మాఆయనకు భలే కోపం" సూచన్నుంచీ "ఇంటి ముందు ముగ్గులేక పోతే ఇంటికి దరిద్రం పట్టుకుంటుంది" లాంటి సుభాషితాలు విసుర్తూ, ఆ 'దరిద్రం' సత్యవతే నన్నట్టు ముఖాలు వికృతంగా చేసుకుని చూడ్డం వరకూ వెళ్ళింది. కొన్ని సార్లు విననట్టు ఊరుకొన్నా, వాళ్ళ ఇంటి చాకిరీ చూసి చిర్రెత్తినప్పుడు మాత్రం" ఆదరిద్రమేదో యీ గదిలో వున్ననాకే వస్తుంది. మీ కేం? మీ చాకిరీ అదృష్టం మీకుందిగా" అంది. అలాగాదట, దరిద్రం అద్దెవాళ్ళను వదిలేసి, ఓనర్లమీదికే పోతుందట!

వాళ్ళు అలా అన్లేదుగానీ, ఆ తర్వాత వాళ్ళమాటల సారాంశమదే. వాళ్ళ భయం అదే. "నిజమే దర్రిదం పట్టుకోకపోతే అస్తమానం అలా చాకిరీ చేస్తూ వుంటారా" అనుకుని నవ్వుకుంది. "మా ఆయనకు మహాకోపం" అన్నమాటకు "నాకు మా ఆయన లేడు, కోపమొచ్చినా ఏదొచ్చినా నా సొంతమే" అని ఇంకా రెచ్చ గొట్టింది. అక్కన్నుంచీ ఇక్కడా పరిస్థితి చెడింది. మళ్ళీ........ !

★ ★ ★

అప్పుడే ఏడున్నరకావడం చూసి సత్యవతి మిగతా పనులకోసం కాఫీ కప్పు అందుకుని చటుక్కున లేచింది. ఈ లెక్కన యీరోజు చేయవలసిన పనుల్లో ఇల్లు వెతుక్కోవడం కూడా వుంది. తనీసంగతి మరిచిపోయింది. ఇలా ఆలోచిస్తూ కూచుంటే ఏ పనీ చేయకుండా నే 'పుణ్యకాలం' కాస్తా పోగొట్టుకుని, 'అత్యాచారకాలం' (సింగిల్ కాలమ్) లో పడిపోవాలి.

★ ★ ★

సంక్రాంతి ఇంక రెండు రోజులే వుంది. ఇవ్వాళ సత్యవతికి మళ్ళీ 'ఆఫ్'. డ్యూటీలో వున్నరోజుల్లో వార్తల ప్రపంచాన్ని తప్ప వాస్తవప్రపంచాన్ని చూసే అవకాశం వుండదు. ఈ వారంరోజుల్లో 'గృహాన్వేషణ' జరగనేలేదు. పోనీ........ ఇంటావిడ కచ్చితంగా ఖాళీ చేయమన్లేదుకదా ........ ! అప్పుడుగుర్తొచ్చింది. అయిదారు రోజులుగా ఆమెకనిపించలేదనీ, కూతురొక్కతే ఇంటిచాకిరీ చేసుకుంటోందనీ. పుట్టింటికి వెళ్ళిందేమో! కూతుర్నొదిలేసి ఒక్కతే వెళ్ళి వుంటుందా?

పంపుదగ్గర నీళ్ళు పట్టుకుంటున్నప్పుడు అప్పలమ్మను అడిగింది. అప్పలమ్మ చెప్పిన వివరాల ప్రకారం ఆమె పుట్టింటికే వెళ్ళింది. అయితే పండుక్కనికాదు. పుట్టింట్లోఏడ్చి, మొత్తుకొని, పోట్లాడి (ఏచావన్నాచచ్చి) యాభై వేలు తేవడానికని వెళ్ళింది........ కాదు వెళ్ల గొట్టబడింది. ఆమె పుట్టిల్లు బందరు. తలిదండ్రులకు ఇద్దరూ ఆడపిల్లలే. ఇటీవల ఆమె అక్క కూతురుకు రెండులక్షల కట్నంతో పెళ్ళి చేశారు. ఆ కట్నం డబ్బులో యాభై వేలు ఈమె తండ్రి ఇచ్చినట్టు ఈమె మొగుడికి తెలిసింది. "నువ్వూ నీకూతురు కట్నానికి మీ నాన్న నడిగి యాభై వేలు పట్టుకొస్తే నా గుమ్మం తొక్కు, లేకుంటే మీ అమ్మా నాన్నలదగ్గరే వుండు" అని గెంటేశాడు.

'స్త్రీకి స్త్రీయే శత్రువు' గా ఎలా కనపడుతోందో అర్థమవుతోంది. "ఆడదానివికాదూ,

ముగ్గు వెయ్యడం రాదూ?" అన్నా, "ఇల్లు శుభ్రంగా లేక పోతే ఆయనకు మహాకోపం" అన్నా, స్త్రీలు ఏ నేపథ్యంలోంచి, ఏ పంజరంలో వుండి ఆ చిలకపలుకులు వల్లిస్తున్నారో అర్థమవుతోంది. "ఇల్లు చూసి ఇల్లాలిని తెలుసుకోవచ్చు" అవునవును. ఇల్లాలు ఇలా అనుకునే మురిసి పోతూవుంటుంది. అవసరమైన సమయంలో మాత్రమే. 'ఇల్లాలుడు' కనపడతాడు కనుక, అంత తేలిగ్గా, ఇంట్లో చూసినంత మాత్రాన తెలుసుకోలేరు. 'ఇల్లాలుడు' ఎప్పుడు బయటపడతాడో అప్పుడా ఇల్లాలు ఇంట్లో నుంచీ వీధిలో పడుతుంది. అంత వరకూ ఇంటి సామ్రాజ్యమంతా ఇల్లాలిదే! ఇల్లాలే దేవత, ఇల్లే స్వర్గం!

ఇంటావిడ కూతురు ఒక చేత బకెట్, ఇంకోచేత తుడుపుగుడ్డా పట్టుకుని వసారా తుడుస్తోంది. అస్తమానం వ్యసనం పట్టుకున్నట్టు చాకిరీ చేసిన ఇల్లాలు హీనస్థితిలో వెళ్ళిపోయింది. యాభై వేలూ పట్టుకొస్తే 'భర్త' ఆమెకు మళ్ళీ గృహసేవచేసుకునే అవకాశం కలిగిస్తాడు. తన కట్నం డబ్బుకోసమని ఆ ఇల్లాలిని అంత అవమానించి తరిమితే, డిగ్రీ చదువుతున్న యీకాబోయే 'ఇల్లాలు' పట్టించుకోకుండా యథా ప్రకారం చాకిరీ చేస్తోంది. ఆ ఇల్లాలికీ, యీ కాబోయే ఇల్లాలికీ ఇదేమీ ఘోరంగా కనిపించకపోవచ్చు. తాను అవమానం పొందిన ఆతల్లి తన కూతురికీ అటువంటి అవమానాన్ని 'కొని' తెచ్చే యత్నంలో వుంది. తన తల్లి పొందిన అవమానాన్ని చూచి ఆ కూతురు అటువంటి అవమానాన్ని భరించడానికి తనూ సిద్ధపడుతోంది. బహుశా దీన్ని వాళ్లు బాధ్యతతో సంసారం చక్క దిద్దుకోవడంగానే భావిస్తారేమో!

ఇక ఆ అమ్మాయిని చూడలేనట్టు సత్యవతి వీధివైపు కొచ్చింది. వీధిలో ప్రతి ఇంటి ముందూ ముగ్గులే. 'ముత్యమంతా పసుపు ముత్యాలముగ్గు.' గుమ్మంముందు ముగ్గుంటే గృహానికి శోభ, గృహిణికి సౌభాగ్యం. అందుకే ఈ గృహిణులంతా ఇలా ముగ్గులు తీర్చి కూర్చుని సౌభాగ్యవతులయ్యారు. ఛీ! ఛీ! సత్యవతీ నువ్వొట్టి 'సినిక్' వి. నువ్వుదౌర్భాగ్యవతివి నీకు ఈస్తటిక్ సెన్స్ లేదు. జీవితాన్ని సుందరంగా, కళాత్మకంగా తీర్చుకోవడం తెలీదు. నీది భారతీయాత్మకాదు, ఆడ ఆత్మ అసలేకాదు. ముగ్గులో వున్న భారతీయతను చూడలేదంటే నువ్వు భారతీయురాలివేనా?

పడక్కుర్చీలో వాలి తనను తాను 'కసి' గా తిట్టుకుంది సత్యవతి. ఆ కసి ఒకవైపు పెదవులమీద నవ్వునూ, కళ్ళలో తడినీ తెప్పించింది. కళ్ళలో తడి బిందువులుగా మారి జారిపడకుండా చూడాలన్నట్టు కళ్ళు మూసుకుంది. మూసుకున్న కళ్ళకు ఓ బ్రహ్మాండమైన దృశ్యం కనిపిస్తోంది. అది విషాద బీభత్సంగా, భయంకర సౌందర్యంగా పద్మవ్యూహంలాగా వున్నముగ్గు! ఎంతో తెలివితో, ఎంతో నైపుణ్యంతో, ఒక గీతనూ ఇంకోగీతనూ ఎలాకలిపిందీ

ఎంత నిశితంగా చూసినా కనిపెట్టలేనంత నిగూఢంగా వేసినముగ్గు! ఆ ముగ్గు వేసింది సన్నని, పొడవాటి, సుకుమారమైన, అందమైన, అమాయకమైన వేళ్ళు కాదు. బలంగా, మోటుగా, తూటాల్లాగా వున్న వేళ్ళు! ఆవేళ్ళు వేల ఏళ్ళుగా వేస్తున్న ఆ ముగ్గు మధ్య నెత్తిన పూలరేకుల్లో వున్న పేడగొబ్బిళ్ళు. పేడ, ఆడ, గొబ్బిళ్ళు, గొబ్బిదేవతలు! ఆ గొబ్బిదేవతల్లో......... ఆ ఆడ,పేడ, గొబ్బిళ్ళలో...... బుల్లెమ్మ, 'ఇంటావిడ' వంటి కోట్లాది ఇంటావిడల పోలికలు! ఇంటావిడ కూతురువంటి భావి ఇల్లాలూ, తనలాంటి మాజీ ఇల్లాలూ అందులోనే....... అందులోనే........ ఆపద్మవ్యూహపు ముగ్గులోకి చొచ్చుకొని వెళ్లి బయట పడలేక...... అందులోనే దేవతలై, బొమ్మలై...........

*(1989 'ఆంధ్రజ్యోతి' దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురితం)*

## -- కథ గురించి. . .

విజయవాడలో అద్దె యింటి కోసం అన్వేషించినప్పుడంతా గుమ్మం ముందు రోజూ ముగ్గువేయాలన్న షరతు ఎదురయింది. గుమ్మముందు ముగ్గు ఉంటే అందంగా ఉంటుందన్న నమ్మకం నుంచి మరింత ముందుకు (లేక వెనక్కి) వెళ్ళి, గుమ్మం ముందు ముగ్గు లేకపోతే ఇంటివాళ్ళకు అరిష్టం అనుకునేంత వరకూ ఆ నమ్మకం బలపడింది. అంతకు ముందు మాకు అది అంత ముఖ్యమైన షరతుగా ఎదురయిన అనుభవం లేదు.

స్త్రీకి ఇంటిపని చాకిరీయే అదనంగా ఉండగా, ఇంటికి చాకిరీ చేయడం అన్న పనికూడా ఇక్కడ అదనంగా వున్నట్టు అర్థమయింది. అదనంలో అదనంగా ఉన్న ఆ 'ఇంటి చాకిరీని 'అద్దె యిల్లాలికి కూడా పంచాలని స్వంత యిల్లాలు (స్వంత ఇల్లు గల 'ఆలు') పడే తాపత్రయం కూడా చూసాము. అప్పుడు పుట్టింది ఈ కథ రాయాలన్న ఆలోచన. ఆలోచన పుట్టిన నాలుగయిదేళ్ళకు కథపుట్టింది.

నాకు ఇప్పటికీ సంతృప్తిని కలిగిస్తున్న కథల్లో ఇదీ ఒకటి.